# లంబాడీల పెళ్లిళ్లు - 'తాంగ్డి' విశిష్టత

డా॥ సూర్యాధనంజయ్
అసోసియేట్ ప్రొఫెసర్

వివాహ వ్యవస్థ మానవ జీవితంలో మహత్తరమైనది. అష్టాదశ సంస్కారాల్లో ముఖ్యమైనది వివాహ సంస్కారం. ఇది ఒక సామాజిక భద్రత స్త్రీ పురుషులు కలిసి జీవించడం, సామాజిక బాధ్యతలను కలిసి నిర్వర్తించడం వివాహ బంధంలో నిబిడీకృతమై ఉంటాయి. వివాహం ద్వారా కొత్త బంధాలు, బంధుత్వాలు ఏర్పడతాయి. వివాహ వ్యవస్థే కుటుంబ వ్యవస్థకు మూలమని చెప్పవచ్చు.

వివాహపు ఆచారాలు ఒక్కో సమాజానికి ఒక్కో రకంగా ఉంటాయి. గిరిజనుల ఆచారాలు అలాంటివే. వారు తమ ఆచారాలను, సంప్రదాయాలను తరతరాలుగా నిలుపుకుంటూ వస్తున్నారు. వీరిది ప్రత్యేకమైన సంస్కృతిగా గుర్తింపు పొందింది.

ముఖ్యంగా బంజారాల వైవాహికపు ఆచారాలను పరిగణలోనికి తీసుకుంటే వీరి సంస్కృతి, సంప్రదాయాలు అందరికంటే భిన్నంగా ఉంటాయి. పూర్వం ఈ తెగల్లో కన్యాశుల్కం ఉండేది, వరుని పక్షాన వధువు కుటుంబానికి 'కరార్, ధరార్' కింద 'పాంచ్ పర్‌చాళిస్' (నలభై ఐదురూపాయలు) నాలుగెడ్లను కానుకగా ఇచ్చేవారు. 'కరార్' అనగా ఒప్పందం అని అర్థం. తెలుగు సంప్రదాయపు పెళ్లిళ్లలో అమ్మాయిలకి బట్టలు పెట్టి నిశ్చితార్థం చేసినట్లే, వరుని పక్షాన లంబాడీలు కూడా అమ్మాయి తండ్రి చేతిలో నలభై ఐదు రూపాయలు పెట్టి "మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాము" అని అంగీకారం తెలుపుతారు. నలభై ఐదు రూపాయలే ఎందుకిస్తారనే సందేహం కలగవచ్చు. ఈ రూపాయలు 'తాంగ్డి' అనే గోనె సంచి ధర. ఈ సంచి చాలా పెద్దది. దీనిని ఇంటి దూలానికి వెళ్లాడదీస్తారు. 'ధరార్' అనగా కన్యాశుల్కం కింద నాలుగు ఎడ్లను కానుకగా ఈయడం. ఈ ఆచారం ఆర్షవివాహాన్ని తలపిస్తుంది.

మను స్మృతిని అనుసరించి కన్య యొక్క తండ్రి వరుని నుండి యజ్ఞాది ధర్మ విహిత కార్యాల్లో ఒకటి లేదా రెండు గోవుల జతను తీసుకొని వివాహం చేసే ఏర్పాటు ఉంది.

"ఏకం గోమిథునం ద్వేవా వరాదాయ ధర్మత:
కన్యా ప్రదానం విధివదార్షో ధర్మ: సఉచ్చతే"

ఇది కొంచెం బంజారాల్లో మార్పు పొందింది. బంజారాలు వాణిజ్య పరంగా రవాణా సాధనాలుగా ఎడ్లను ఉపయోగించేవారు. కాబట్టి కన్య కుటుంబం వారికి కానుకగా ఎడ్లను ఈయడం ఆనాటి ఆచారమయి ఉండవచ్చు. వీరు క్రమక్రమంగా వ్యవసాయాన్ని ముఖ్యవృత్తిగా ఎంచుకున్నారు కాబట్టి శుల్కం కింద ఎడ్లను కానుకగా ఈయడం సంప్రదాయమైంది. కాని నేడు తెలుగు వారి ఆచారాలను అనుకరించడం వల్ల లంబాడీల వివాహపు ఆచారాలు మరుగున పడిపోయాయి. ఎక్కడో మారుమూలన గల తండాల్లో తప్ప ప్రత్యేకించి వీరి వివాహపు ఆచారాలను ఎవ్వరు పాటించడం లేదు. కనుక బంజారా సంస్కృతికి అవసాన దశ వచ్చిందని చెప్పక తప్పదు.

లంబాడీల వివాహపు తంతువు విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. అది వారి ఆర్థిక పరిస్థితిని బట్టి, సమాయన్ని బట్టి నెల లేదా కొన్ని నెలల పాటు జరుపబడుతుంది. వీరి పెళ్లిళ్లు ఎక్కువగా ఎండాకాలంలోనే జరుగుతాయి. "హోళీర్‌పాంచ్మా' (హోలి పండుగ నాటికి) వ్యాయా, ఘోటా అనే వివాహపు కార్యాలు అయిపోవాలనే నియమం ఉంది. ఆ తర్వాత వీలును బట్టి మిగతా తంతువును నిర్వహిస్తారు. వీరి వివాహపు సందర్భాలలో కఠోర నియమాలు పాటించడం చేత ఒక్కొక్కసారి వరుడు పారిపోయే అవకాశం కూడా ఉ ంటుంది.

లంబాడీల పెళ్లిళ్లకు సాధారణంగా పురోహితులుండరు. మంత్ర తంత్రాలుండవు. తండాలోని పెద్దల సాక్షిగా కార్యక్రమాలు జరుగుతాయి. వీరి వివాహ సంస్కారాల్లో సగాయి, వదాయి, సాడితాణేరో, ఘోటా కాడేరో, డోరణ్ భాందేరో, వ్యాయభాందేరో, చూడోతీపేరో, సాత్‌ఫేర పేరేరో, తాంగ్డి బారకాడేరో అనేవి ముఖ్యమైన ఘట్టాలు.

**తాంగ్డి బారకాడేరో నొక్తా (అప్పగింతలు)**

వివాహనికి సంబంధించిన కార్యక్రమాలలో చివరది అప్పగింతల కార్యక్రమం. భారత దేశంలో అన్ని మూలలా ఈ ఆచారం ఉంది. బంజారాల్లో దీనికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. 'తాంగ్డి' అనగా గోనె సంచి. వధువు వెంట అత్తవారింటికి పంపె వస్తువులను ఈ సంచిలో భద్రపరుస్తారు. గోనె సంచినే ఎందుకు ఇస్తారు? పెట్ట ఈయవచ్చు కదా అని మనకు సందేహం కల్గవచ్చు కాని పూర్వం వీరికి స్థిర నివాసాలుండేవి కావు. 'లదణీ' ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి ప్రయాణం చేసేవారు. కనుక నిర్మించుకున్న పూరి గుడిసెల్లో దూలాల మీద పెట్టుకోవడానికి వీలుగా ఉంటుందని ఈ తాంగ్డిని ఈయడం సంప్రదాయమైంది. ఈ గోనె సంచుల స్థానంలో నేడు సూట్‌కేసులు, బీరువాలు కనిపిస్తున్నాయి.

తెల్లారితే వధువును అత్తవారింటికి సాగనంపే కార్యం అప్పగింతులు ఉంటుంది, పుట్టింట్లో అల్లారు ముద్దుగా పెరిగిన అమ్మాయి అత్తవారింటికి వెళ్లేసమయంలో ఎంతో మానసిక వేదనకు గురౌతుంది. తన వారందరిని వదిలి వెళ్ళవలసి వస్తుందనే బాధ ఆమెను వేదిస్తుంది. ఇంత వేదనకు గురిచేసే అప్పగింతలు లేకుంటేనే బాగుంటుందనిపిస్తుంది. ఇక లంబాడి వధువు తెల్లారకపోతే బాగుండునని కోడిపుంజును వేడుకునే తీరు మనల్ని కలచివేస్తుంది. ఊర్లల్లో కోడికూత వినిపిస్తే తెల్లారినట్లే. కావున కోడి పుంజును 'కూతకూయకే' అని గేయరూపంలో ప్రార్థిస్తున్న తీరు అందరిని కంటనీరు పెట్టిస్తుంది. లంబాడి వధువు శోకాలాపనను మనం ఒకసారి పరిశీలిద్దాం

"తూ ఘడియేక మత బోలేసరే మారె నాయక బాపురో
పాళో పూళో కూకడో ॥ఆహియా॥
తూంయి నయి బోలియసతో మారె బాపురజ్
గోదేమాయి ధాపన్ సోయు కూకడో ॥ఆహియా॥
తారి భాంగేనజ సోనో మాండాదూన
టాంగేన రూపో మండాదు భాంగి కూకడో ॥ఆహియా॥
తూంయి నయి బోలియసతో మారియాడిర్
గోదేమాయి గ్యారి నీంద్ లీయు భాంగి కూకడో" ॥ఆహియా॥

'భాంగి' అనే పేరుగల పెంపుడు కోడి పుంజు తండా నాయకునిది. ఇక్కడ తండా నాయకుని కోడి పుంజు అని వధువు ప్రత్యేకంగా ఎందుకన్నదంటే, తండాకు కొన్ని కట్టుబాట్లుంటాయి. తండా నాయకునికి తెలియకుండా తండాలో ఏ పని జరగడానికి వీలులేదు. కనుక తండా నాయకుని కోడిపుంజు తొందరపడికూస్తే తెల్లారిపోయిందని భావించి, నాయకునితో పాటు అందరు కలసి తనను అత్తగారింటికి పంపిస్తారనే భయంతో వధువు కోడిపుంజును వేడుకుంటుంది. తానింక అమ్మబడిలో కాసేపు, నాన్న పక్కలో కాసేపు హాయిగా పడుకోవాలని కోరుకుంటుంది. అంతేకాదు "నువ్వు కూయకుండా ఉంటే నీ కాళ్ళకు బంగారు తొడుగు చేయిస్తా" నని బ్రతిమాలుకుంటుంది. ఈ అభ్యర్థన ఎంతటి కఠిన హృదయులనైనా కదిలించివేస్తుంది.

లంబాడీలు ఏ శుభకార్యం చేసినా మంచి చెడులను బాగా పరీక్షిస్తారు. వీరికి శకునాలంటే పట్టింపు లెక్కువ. ఏదైనా మంచి పని జరిగితే "నక్కను తొక్కి వచ్చావా" అని అడుగుతారు. కాని నక్కలు కూసినా, ప్రయాణం చేస్తున్నప్పుడు కుడివైపు నుండి ఎడమ పోయినా అశుభమని లంబాడీల విశ్వాసం. అంతేకాదు

తమ ప్రయాణాలు కూడా మానుకొంటారు. అందుకే వధువుకు ఈ గేయంలో తన ప్రయాణం ఒక రోజు ఆగిపోవాలనీ అందుకు నక్కను కూయమని వేడుకోవడం గమనార్హం. అది కూడా తండా నాయకుడు వింటనే తన ప్రయాణం ఆగిపోతుందని, అందులో ఆడనక్కను మాత్రమే కూత కూయమని ఆడిగేతీరు వర్ణనాతీతం

తూ ఘడియేక బోలేసయే మారి అడిబిరి సాళి!
తూంయీ బోలియసతో మారి తాండేరేమాయి రీంయు సాళి!!
మారజ తాండేరో నాయక బాపు సమ్మణ్ వజారీయా!!!
జన మఏక దాడ మారి జావణుతిరీంయు యేమారిసాళి!

తన ప్రయాణం ఆగిపోతే తండాలో ఒక రోజు ఉండవచ్చునీ, తన స్నేహితులతో గడపవచ్చని నక్కను బ్రతిమాలిన తీరుచూస్తే నూతన వధువు యొక్క మానసిక స్థితి ఎలాంటిదో మనకు అర్థమవుతుంది. ఏ వధువుకైన పుట్టింటి మీదా మమకారం ఎక్కువ. ఈ గేయం వధువు యొక్క మనస్తత్వాన్ని ఎంతో అద్భుతంగా చిత్రించింది.

సూర్యుడు ఉదయించడం ప్రకృతి సహజం. దాన్ని ఎవ్వరు ఆపలేరు. తెల్లారిన తర్వాత లంబాడి వధువును చక్కగా అలంకరించి ఇంటి బయటకు తీసుకొచ్చి ఎద్దు మీద కూర్చోపెట్టే ఆచారం ఉంది. ఈ ఆచారానికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. ఏ జాతిలో లేని ఆచారం లంబాడీల్లోనే ఉంది. సామాన్లను తాంగ్డిలో పెట్టి ఎద్దు మూపుపై ఉంచి దాని మీద నూతన వధువును నిలబెడ్తారు. లంబాడీలకు పశువులతో అనుబంధం ఎక్కువ. వీరు ఎడ్ల మీద నిత్యావసర వస్తువులను తీసుకొని వెళ్తారు. ముఖ్యంగా వ్యాపారస్తులు ఉప్పును రవాణా చేస్తారు. కావున వధువుకు సంబంధించిన వస్తువులను ఎద్దు మీద పెట్టి సాగనంపే ఆచారం వచ్చిఉంటదనేది యదార్థం.

ఎద్దును 'డోళియా' అంటారు. దీనిని గంగిరెద్దు కంటే బాగా అలంకరిస్తారు. కొమ్ములకు పూసలతో కుట్టబడిన 'చాందియా' బాసింగాల వంటి అలంకరణను అమరుస్తారు. ఇలా చక్కగా అలంకరించిన ఇంటి ముందుకు తీసుకొన్చి దాని మీద తాంగ్డిని ఉంచి వధువును ఎక్కిస్తారు. అపుడు వధువు తనవారిని వదిలిపోలేక తానెక్కబోయే ఎద్దు (డోళియా) ఇంటి ముందుకు రాకుంటే బాగుండుకదా అని అనుకుంటున్న వైనం ఈ 'ఢావ్లో' (శోక గీతం)లో కనిపిస్తుంది.

"డోళియారే ! తోన శాణియ ఖడ ఖొరాదున
ఖల్లునాయకేరో తళాయేరో ఛాణోఘాణో పాణి పరాదు డోళియా!
డోళియారే! తాతియే ఘాటో ధ్వాళో ఖాదునజ
మాతియే ఘాటో మారి జావణూరో ఝూరలో డోళియా!
డోళియారే ! రూపకేరి రాసుడేన సోనకేరి సాంకళి తోడలేన
థాంసజో డోళియా !
ఘడియేక చరియసతో తారోఖాదు తోన భళియ డోళియా !"

ఎద్దుతో వధువు వేడుకున్న విధానాన్ని గమనిస్తే ఆమె అమాయకత్వం, సున్నితమైన మనస్తత్వం మనకు అర్థమౌతుంది. ఎద్దు తన ఇంటి ముందుకు రాకుండా ఉన్నట్లైతే మంచి రేలు గడ్డిని తినిపిస్తానని, వడబోసిన చెరువు నీటిని తాగిస్తానని, అలంకరణలను చేయిస్తానని, ఎద్దు అక్కడికి రావడం వల్ల అది ఆవుల మందకు దూరమైనట్లే తాను తన పుట్టింటికి దూరం కావలసి వస్తుందనీ, అందుకే తన సంకెళ్ళు తెంచుకొని వెళ్లిపొమ్మని వేడుకోవడం ఒక కరుణసర ఘట్టం వుదరభరితమైన ఈ తాంగ్డి బారకాడేరో కార్యక్రమం వైవిధ్యాన్ని కలిగి ఉంటుంది.

ఇంటి ముందు అలంకరించి నిలబెట్టిన ఎద్దుమీద వధువు నిలబడి చేతులు తిప్పుతూ పుట్టింటి వారి సుఖాన్ని కోరుతుంది. తనను కని పెంచిన తల్లిదండ్రులను, తండావాసులను క్షేమంగా ఉండాలని కోరుతూ శోక గీతాన్ని ఆలపిస్తుంది.

"మడగీయే! వడలాజు వదే సయేనజ
ఘురలజు ఫ్యాలేసయే మారే,
సావుకారె బాపురి మడగీ! ॥ఆహియా॥
మడయేగీయే! లింబుడాజు లారలేసనజ
హరిదుబాడిజు హరిభరిరకాడేస్
మారె సావుకారే బాపురి నారళేరి కోటడి ॥ఆహియా॥"

మా వాళ్ళ వంశం మర్రి చెట్టులాగా విస్తరించాలనీ, సంపద మేడి చెట్టులాగా, నిమ్మచెట్టు లాగ పెరగాలనీ, సంసారం పచ్చగా విలసిల్లాలని ఇస్తున్నటువంటి దీవెనలలో ఎంతో ప్రత్యేకత ఉంది. తాను పుట్టింటి నుండి ఎంతో పొందింది. అన్నిటి కంటే మంచి ప్రేమను, దాన్ని అభివ్యక్తం చేస్తుందీ పాట.

సాధారణంగా అమ్మాయిలకు తన పుట్టింటివారు ధనధాన్యాలతో, అష్టైశ్వర్యాలతో ఎప్పుడూ సుఖంగా ఉండాలని ఉంటుంది. అందుకు పై గీతం ఒక మంచి ఉదాహరణ.

అ తర్వాత వధువును వరుని వెంట సాగనంపే కార్యక్రమాన్ని 'తాంగ్డిమేలేరో' నొక్తా అని అంటారు. ఈ తాంగ్డి వారి సంస్కృతిలో ఒక భాగమే. తాంగ్డిని బయట ఉంచి వధువు తండాలో ఉన్న ఇంటింటికి వెళ్ళి గుర్తుగా ప్రతి ఇంటిలోని దూలానికి ఒక పురికోసకట్టి ముళ్లు వేసి మరీ ఏడుస్తుంది. ఆ ఇంటి వారు ఒక్కొక్క ముడి విప్పినప్పుడు తనను చింతాణ్ణి (జ్ఞాపకం) చేసుకోవాలని ఆమె ఉద్దేశం. ఈ ఆచారం కూడా ఏ కులంలో లేదు. ఇక్కడ బంజారాల నిలిచిపోయిన ఆనవాళ్ళు మనకు కనిపిస్తాయి.

ఇక తండాలోని వారందరు కలిసి వధువును సాగనంపేటప్పుడు తండ్రి ఉపదేశిస్తుంటే వధువు "ఢావ్లో" ద్వారా తలచి తలచి ఏడుస్తుంటుంది. తండ్రి చెప్పిన ప్రతి మాటను కొంగున ముడివేసుకుంటానని అనడంలో వధువుకు గల పితృభక్తి తేట తెల్లమవుతుంది. లంబాడీలలో బాల్యవివాహాలు ఎక్కువ. కాబట్టి బాలికలు అత్తవారింట్లో మెలగవలసిన విధానాన్ని గురించి తల్లిదండ్రులు చేసే ప్రబోధం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. ఇక్కడ కణ్వ మహర్షి శకుంతలను అత్తవారింటికి పంపుతూ ప్రబోధించిన విదానం మనకు స్ఫృహలోకి వస్తుంది. తనవాళ్ళందరూ తనకు దూరమౌతున్నారనీ, అత్తగారింటికి పోతున్న తను ప్రయాణాన్ని దారిలోనే ఆపి తిరిగి రావాలనుకున్నదట. కాని తన కాళ్ళకు వివాహ రూపంలో వెండితాళం పడిందని 'ఢావ్లో' ద్వారా విలపిస్తుంది. ఈ సన్నివేశాన్ని నేరుగా చూడక్కరలేదు. ఆ గేయమే మన కళ్ళకు చూపిస్తుంది. బంజరాల ఢావ్లోలో ఉన్న పదాలు మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లంబాడీల ఢావ్లో లయ బద్ధంగా ఉంటుంది. అప్పటికప్పుడు అల్లుకొన్నవి. వీరు పెళ్లిళ్ల సందర్భంలో డప్పులు బాగా ఉపయోగిస్తారు.

**ఆధార గ్రంథాలు**


1. బంజారా చరిత్ర – సంస్కృతి ప్రగతి. బి. చీనియానాయక్ 1998.
2. సుగాలీ సంస్కృతి భాషా సాహిత్యాలు – డా. ఎం. గోనానాయక్ 2002
3. కరీం నగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు – జనపాల :శంకరయ్య 1995
4. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ – డా॥ సూర్యాధనుంజయ 2009
5. నూతనకల్ మండలం–వివాహ ఆచారాలు–డా. సిల్మానాయక్ (అముద్రితం).
6. మనుస్మృతి – మనువు.


**మౌఖికసేకరణ**


1. భూక్య బాలునాయక్–పొట్టిచల్మతండ, నల్లగొండ జిల్లా.
2. లూణావత్ ధర్మిబాయి–భల్లునాయక్ తండ, నల్లగొండ జిల్లా.